క్లుప్తంగా

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



బాన్సువాడరూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ యూనిట్‌ను కల్నల్ విష్ణు పి నాయర్ ప్రిన్సిపల్ గంగాధర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కల్నల్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సృజనాత్మకత, దేశభక్తి పెరుగుతాయన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. ఎన్‌సీసీ కళాశాల అధికారి కృష్ణ రాథోడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, శ్రీదేవి, రాజేష్, బంటు విఠల్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అంబీర్ శ్రీహరిరావు, ఇందిరాబాయి జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోటివేషన్ క్లాసులను కూడా నిర్వహించారు. దాత నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. పరీక్షా ప్యాడ్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. అలాగే ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మోటివేటర్ శివకుమార్, దాత నరేందర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల పరిశీలన

దోమకొండ: మండల కేంద్రంలో గురువారం వ్యవసాయ పనులను అభ్యుదయ పాఠశాలకు చెందిన విద్యార్థులు పరిశీలించారు. పొలం వద్దకు వెళ్లి వరి నాటు వేసే విషయంపై రైతులతో మాట్లాడారు. విద్యార్థులకు వ్యవసాయ పనులపై అధ్యయనం కోసం పొలంబాట పనులను పరిశీలించినట్లు ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు నిహారిక తెలిపారు. పలువురు రైతులు పంటలసాగుపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన వంట పాత్రల వితరణ



బీబీపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం అదే పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలు ఎం.సరిత విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన వంట పాత్రలను గురువారం పాఠశాలకు వితరణ చేశారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ బందం అభినందనలు తెలియజేశారు.

ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని ఏఎస్సై రాములు తెలిపారు. గురువారం మండలంలోని పోచారం చౌరస్తా 161 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్సై రాములు మాట్లాడారు. పోలీస్ సిబ్బంది అంజని, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా(ఎస్ఆర్ఎన్‌కే) ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలను గురువారం ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ తనిఖీ చేశారు. కళాశాలలో అడ్మిషన్ల సరళిని అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు మరింత కష్టపడి మంచి విద్య అందించాలన్నారు. రికార్డులు పరిశీలించారు. కళాశాల అటానమస్ స్థాయికి చేరుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ గంగాధర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు గుల్ దస్తా వద్ద గురువారం నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఇంజినీర్స్‌డేను నీటిపారుదలశాఖ అధికారులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఈఈ సులేమాన్, డిప్యూటి ఈఈ సురేశ్, ఏఈ శివప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ తదితరులున్నారు.

సమస్యల సంత



కనీస సౌకర్యాలు లేకుండా సాగుతున్న నస్రుల్లాబాద్ సంత

- వర్షపునీళ్లలోనే కూరగాయల విక్రయం
- సీసీ రోడ్లు, మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాటుకు డిమాండ్

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : వారాంతపు సంత సమస్యల వలయంగా మారింది. ప్రతిఒక్కరూ వారం వారం కూరగాయలు కొనుగోలు చేయడానికి సంతకు వెళ్తుంటారు. అయితే కూరగాయలు తదితర ఆకుకురలన్నింటినీ బురద నీటి పక్కన, ఈగలు ముసురుతున్న ప్రదేశాల్లో విక్రయిస్తుండడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎండయినా.. వానయినా అక్కడే..

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రతి బుధవారం వారాంతపు సంత జరుగుతుంది. అయితే అక్కడ ఎండకాలమైనా వర్షాకాలమైనా మట్టిలోనే కూరగాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అమ్మకపు దారులకు ఎండకాలం ఎండుతూ...వర్షాకాలం తడుస్తూ కూరగాయలు అమ్ముకుంటున్నారు. వర్షాకాలం పెద్ద వర్షం పడితే కూరగాయలు కొనుగోలు చేయడానికి సామాన్యుడు ఆగి కొనలేని పరిస్థితి నెలకొంటుంది. గతంలో షెడ్ నిర్మాణం కోసం రూ.20 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా నిధులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాని వాటి ఊసే ప్రస్తుతం కనబడలేక పోవడంతో ఇబ్బందులకు గురి అవ్వక తప్పడం లేదు.

కనీస వసతులు కరువు..

వారాంతపు సంతలో గంటల పాటు వ్యాపారులు రోజుమొత్తం అక్కడే కూర్చుని కూరగాయలు విక్రయిస్తూ ఉంటారు. అయితే వారికి కనీసం తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో అటు వ్యాపారస్తులకు ఇటు కొనుగోలుదారులకు కూడా తిప్పలు తప్పడం లేదు.

మరుగుదొడ్లు లేక ఇబ్బంది



సంతలో నాలుగైదు గంటలు కూరగాయలు అమ్ముతుంటాం. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ అమ్మాల్సి వస్తుంది. మండల కేంద్రంలో మార్కెట్ ఏర్పాటు లేకపోవడంతో వ్యాపారస్తుల ఇబ్బందులు పట్టించుకోవాలని కోరుతున్నాం.

– మోసిన్, వ్యాపారి

తాగడానికి నీరు లేదు



అంగట్లో కనీసం తాగడానికి నీరు కూడా దొరకదు. కూరగాయలు అమ్మి నోరు ఎండిపోయినా కూడా గుక్కెడు మంచి నీరు దొరకదు. దీనితో కొనుగోలు దారులకు కూడా ఇబ్బంది ఉంటుంది. ప్రజావసరాలైన నిత్యావసర సరుకులు లభించే చోట సమస్యలను పరిష్కరించాలి.

– మైశయ్య, వ్యాపారి

ప్రతిపాదనలు పంపించాం

కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణం కోసం ఉన్నత అధికారులకు నివేదికలను పంపించాం. నిధులు మంజూరైతే పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టేలా చూస్తాం.

– నీలావతి, ఎంపీడీవో, నస్రుల్లాబాద్

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి



మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో శ్రీనివాస్



దోమల మందు పిచికారి చేయిస్తున్న కార్యదర్శి

బీబీపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయిల్ బాల్స్ తయారి, మురికి కాలువలు, దోమల మందు స్ప్రే, కంపోస్ట్ ఎరువు తయారీ వంటి పనులను పరిశీలించారు. రోడ్డు పక్కన మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ సిద్ధరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

హన్మాజీపేట్‌లో..

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో విషజ్వరాలు ఇంకా కొనసాగుతుండటంతో అధికారులు నష్ట నివారణ చర్యలు చేపడుతున్నారు. గ్రామంలో పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు చెత్తాచెదారాన్ని ఎత్తేస్తున్నారు. వాటర్ ట్యాంకులను ప్రతిరోజు క్లోరినేషన్ చేసి, డ్రైనేజీల్లో దోమలు వృద్ధి చెందకుండా రసాయన మందులు పిచికారీ చేయించారు. కార్యదర్శి రాజేష్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం..

నేడు భిక్కనూరులో శ్రీసంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

భిక్కనూరు: మండల కేంద్రంలోని నగరేశ్వరాలయంలో ఉన్న సంతోషిమాత ఆలయం వార్షికోత్సవాన్ని నేడు(శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసంఘం గౌరవ అధ్యక్షుడు పబ్బ నాగరాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు ప్రపంచ శాంతి కోసం హోమం నిర్వహిస్తున్నామన్నారు.

అయ్యప్పస్వామి జన్మదినోత్సవం

కామారెడ్డి అర్బన్: అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా కామారెడ్డి అయ్యప్ప ఆలయంలో శుక్రవారం స్వామి వారికి వివిధ విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నస్కంటి శ్రీనివాస్, గొనే శ్రీనివాస్‌లు తెలిపారు. శుక్రవారం వివిధ పూజా కార్యక్రమాలుంటాయని భక్తులు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరారు.

14న కామారెడ్డిలో బీసీల సింహగర్జన

కామారెడ్డి అర్బన్: బీసీ కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం వెంటనే బీసీల కుల గణన చేపట్టాలన్న డిమాండ్‌తో ఈనెల 14న ఆదివారం ఉదయం 10 గంటలకు కామారెడ్డి కళాభారతి ఆడిటోరియంలో బీసీల సింహగర్జన నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశం జరిగింది. సమావేశంలో బీసీల సింహ గర్జన సభ నిర్వహణపై చర్చించారు. సంఘం జిల్లా నాయకులు మోహనాచారి, ప్రవీణ్ కుమార్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వన మహోత్సవం



నల్లమడుగులో మొక్కలు నాటుతున్న అధికారులు



ఎండ్రియాల్‌లో మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సయ్యద్

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు, శెట్పల్లి, లింగంపేట గ్రామ పంచాయతీల్లో గురువారం వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖల అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేశ్ మాట్లాడారు. 41 గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో ఉపాధి హామీ కూలీలతో మొక్కలు నాటించాలన్నారు. ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బంది ఉన్నారు.

మొక్కల పంపిణీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్‌లో మొక్కలను గురువారం ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలను నాటాలన్నారు. గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కారోబారు శివానందగౌడ్, ఫీల్డు అసిస్టెంటు సంతోష్, తదితరులు ఉన్నారు.

రేపు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని, విద్యార్థులను ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు మణికంఠ, సాయి తదితరులున్నారు.

ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను గురువారం పంచాయతీరాజ్ శాఖ ఏఈ సురేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి మండలంలో 38 పాఠశాలల్లో పనులు పూర్తి చేశామన్నారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం గంగాధర్, కాంట్రాక్టర్ కృష్ణ తదితరులున్నారు.

వర్షాలు కురవాలని పూజలు



లింగంపేట(ఎల్లారెడ్డి): కోమట్‌పల్లిలో గురువారం గ్రామస్తులు వర్షాల కోసం రాజరాజేశ్వరి స్వామి, హనుమాన్ ఆలయాల్లో నీళ్లు నింపారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా నేటికి ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు స్నానాలు ఆచరించి తడి బట్టలతో బిందెలలో నీళ్లు తీసుకొని శివాలయాలోకి నింపి ప్రత్యేక పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని కప్ప కావడి ఆడారు.

కానరాని వర్షాలు.. ఎండుతున్న పంటలు

- ఆందోళనలో రైతన్నలు
- ప్రత్యామ్నాయంగా బోరు, ఓపెన్ బావుల నుంచి పంటలకు నీరు పెడుతున్న రైతాంగం



స్ప్రింక్లర్ల ద్వారా మొక్క జొన్న పంటకు నీరు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో 20 రోజుల నుంచి వర్షాలు కురియక పోవడంతో ఏపుగా పెరిగిన మొక్క జొన్న పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ మొదట వర్షాలు కురియడంతో రైతులు హడావుడిగా మొక్కజొన్న పంటతో పాటు సోయా, పత్తి వేశారు. మండలంలో 80 శాతం రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి ఉన్నారు. ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న, పత్తి, సోయా, పెసర, మినుము పంటలను ఎక్కువగా వేశారు. కాగా మండలంలో 17వేల ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేస్తున్నారు. మేఘాలు కమ్ముకొని ఉన్నపటికీ వర్షాలు మాత్రం కురియడం లేదు. మక్క పంటలు ఎండిపోవడంతో కొంతమంది రైతులు ఓపెన్‌బావులు, బోరుబావుల నుంచి నీటిని అందిస్తున్నారు. ఇలా కొన్ని రోజులైనా పంటలను కాపాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు. తాడ్వాయి, ఎర్రాపహాడ్, కన్కల్, దేమికలాన్, ఎండ్రియాల్, క్రిష్ణాజివాడి, చిట్యాల, కన్కల్, సోమారం, దేవాయిపల్లి, చందాపూర్ తదితర గ్రామాలలో ఉన్న మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే ఎకరం పంట భూమికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలను సర్వే చేయించి నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలి



బాన్సువాడ: దివ్యాంగుల పింఛన్ పెంచాలని గురువారం బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్‌కు వికలాంగులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌చారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలని, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.300 పింఛన్‌ను రూ.3 వేలకు పెంచాలని అన్నారు. దివ్యాంగులు గంగాధర్ యాదవ్, పూసల కృష్ణ, తదితరులున్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



బాన్సువాడ: ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. గురువారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాన్సువాడలో వన మహోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, సభ్యులు రవి, మనెమ్మ, రోజారమణి, హరిప్రియ, అన్నపూర్ణ, రవళి, అలీం, అజాం, నరహరి, తదితరులు ఉన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర మహోత్సవం



జగన్నాథుడి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే కేవీఆర్, బీజేపీ నాయకులు, భక్తులు

కామారెడ్డి టౌన్: ఇస్కాన్ కామారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వాసవినగర్‌లో ఇస్కాన్ ఆలయం నుంచి జగన్నాథుని విగ్రహాలతో పెద్ద ఎత్తున రథయాత్ర నిర్వహించారు. పట్టణంలో పలు వీధుల గుండా ఈ యాత్ర సాగింది. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి రథాన్ని లాగారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఇస్కాన్ ప్రతినిధులు శ్రీమాన్ వెంకటదాస్, యుధిష్ఠిర దాస్, కమలలోచన్ దాస్, శ్రీరామ్, బలరాం, భక్తులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపి చేస్తున్న డాక్టర్ గంగాధర్



గాంధారిలో ఫిజియోథెరపి చేస్తున్న డాక్టర్ సారిక

బాన్సువాడ రూరల్: దివ్యాంగ విద్యార్థులకు ప్రతిరోజు ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టు గంగాధర్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపి చేశారు. ప్రతి గురువారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియో థెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఐఈఆర్‌పీఎస్ వెంకట పద్మ, సిబ్బంది ఉన్నారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలి

గాంధారి(ఎల్లారెడ్డి): ప్రత్యేకావసరాలున్న దివ్యాంగ చిన్నారులకు తల్లిదండ్రులు ఇంటివద్ద ప్రతిరోజు వ్యాయామం చేయించాలని ఫిజియోథెరపిస్ట్ సారిక సూచించారు. గురువారం మండల కేంద్రంలో గల భవిత కేంద్రంలో ఎనిమిది మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. రీసోర్స్ టీచర్లు పెంటయ్య, సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బగళాముఖి పీఠంలో పూజలు



అమ్మవారి పటాన్ని అందిస్తున్న జ్యోతిష్య పండితులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని బగళాముఖీ అమ్మవారి పీఠాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్ నాగరాజు దంతపతులు దర్శించుకున్నారు. వారాహి నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం వైస్ చైర్మన్‌కు జ్యోతిష్య పండితులు క్రాంతిపటేల్, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

సంక్షిప్తం

చిన్న సంఘాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో గల చిన్న సంఘాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని సీసీ రమేష్‌గౌడ్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని గ్రామ సమాఖ్య కార్యాలయంలో గురువారం గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్థిక లావాదేవీలపై చర్చించారు. ప్రతి నెలా 10లోపు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా తీర్మానాలు చేశారు.

కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణస్వీకారానికి తరలిరావాలి

భిక్కనూరు: హైదరాబాద్‌లో ఈనెల 12న జరుగనున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ ప్రమాణస్వీకారానికి దళితులు భారీగా తరలి రావాలని దళిత సంఘాల నేతలు జీవన్, ద్యాగల కిరణ్ తదితరులు కోరారు. వారు గురువారం భిక్కనూరులో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేయకుండా ఎస్సీ కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించడం అభినందనీయమన్నారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మృతి

బాన్సువాడ రూరల్: కోనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ కొండమీది రాములు బుధవారం మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి గురువారం కోనాపూర్ గ్రామానికి చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆర్ఎంపీ వైద్యుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నలుగురు యువకుల రక్తదానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ మహిళ ఆపరేషన్ కోసం నాలుగు యూనిట్ల ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా పట్టణానికి మంతెన వంశీకృష్ణ, శ్రీకాంత్, శేఖర్, శ్రావణ్‌కుమార్‌లు గురువారం రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త బాలు తెలిపారు. కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేశారని అయన పేర్కొన్నారు.

వృద్ధులకు, నిరుపేదలకు అన్నదానం

భిక్కనూరు: మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయం వద్ద శ్రీసాయి హన్‌మాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం వృద్ధులు, నిరుపేదలకు, ఇతర గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. మండల కేంద్రానికి చెందిన శ్రీసాయి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం డీవీ చలపతి–బబితల సహకారంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయి హన్‌మాన్ సేవా సమితి ప్రతినిధులు కొండూరి శ్రీనివాస్, సింగిరెడ్డి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, శివాజీ విగ్రహాలకు ప్రేమ జంట నివాళి



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలో ఉన్న ఛత్రపతి శివాజీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ప్రేమ పెళ్లి చేసుకున్న నూతన దంపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని అడ్లూర్‌కు చెందిన పెరుమాండ్ల బుల్లెట్ చక్రవర్తి, చిన్నమల్లారెడ్డికి చెందిన బి.రవళిక ప్రేమ పెళ్లి చేసుకున్నారు. గురువారం వారి మిత్రులు, శ్రేయాభిలాషులతో కలిసి అడ్లూర్‌లోని ఛత్రపతి శివాజీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద దండలు మార్చుకుని, మహనీయుల సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.